# ఒక విశ్వాసిగా నీ పిల్లలకు ఏమి బోధించాలి

## 1. దేవుని యొక్క ప్రేమను మన పిల్లలకు బోధించాలి

(మత్తయి 19:13, 14 ); దేవుడు తన ప్రేమను మనుష్యుల మీద ఎలా వెల్లడిపరిచాడో చెప్పాలి. ఎందుకు భూమిమీదకు వచ్చి మరణించాడో చెప్పాలి. పిల్లలు దేవుని గురించి తెలుసుకుని ఆయన సన్నిధికి వెళ్ళే విధముగా మనం వారిని పెంచాలి. అంతే కాకుండా మనతో పాటు వారిని దేవుని సన్నిధికి నడిపించాలి. తద్వారా వారు దేవుని యొక్క ప్రేమను తెలుసుకుని దేవునిలో మరింత బలపడతారు... అయన సన్నిధికి వచ్చువారిని ఆయన విడిచిపెట్టువాడు కాదు...

## 2. తల్లి, తండ్రి, మరియు పెద్దలకు విధేయత చూపడం ఎలాగో వారికి బోధించాలి.

పిల్లలు భూమి మీద దీర్ఘాయుష్మంతులు కావాలి అంటే వారు తమ తల్లిదండ్రులకు ఏ విధంగా విధేయత చూపించాలో యేసు క్రీస్తు జీవితంలో నుండి చూపిస్తూ. ఆయన తన తల్లి తండ్రులకు ఎలా విధేయుడయ్యాడో వారికి చిన్ననాటి నుంచి బోధించాలి....( ఎఫేసీ 6:1); వారు నడువవలిసిన త్రోవలను వారికి బోధించాలి...

## 3. దేవుని ఆజ్ఞను ఎలా పాటించాలో బోధించాలి

(ఎఫేసీ 6:3); దేవుడు తన ఆజ్ఞలను పాటించువారిని వెయ్యి తరముల వరకు కరుణించువాడు అని దేవుని వాక్యము సెలవిస్తుంది. కనుక మన బిడ్డలు దేవుని అజ్ఞల ప్రకారం నడిచేలా మనం జాగ్రత్తలు తీసుకోవాలి. దేవును 10 ఆజ్ఞలను చిన్న నాటినుండి మనం కంటస్థు చేయించాలి.

## 4. దేవుడు ఎలా ఆశీర్వదిస్తాడో బోధించాలి

(ఆది 21:18) హాగరు తన జీవితములో తన కుమారుని పట్ల జరిగిన కార్యము బట్టి మనం తల్లిదండ్రులుగా దేవునికి లోబడితె ఆయన మన బిడ్డలను ఆశీర్వాదిస్తాడు. దేవుడు మనలను ఆశీర్వదించదానికి పిలిచాడు. ఇష్మాయేలును దేవుడు ఎలా ఆశీర్వదించాడో, యోసేపును ఎలా ఆశీర్వదించాడో బోధించాలి.

## 5. దేవుడు ఎలా తోడైయుంటాడో బోధించాలి

(ఆది 21:20) ; హగరు దిక్కుతోచని, నిస్సహాయ స్థితిలో పడి వున్నప్పుడు దేవుడు తనకి తోడైయున్నాడు అదేవిధంగా ఆ చిన్ని బిడ్డకు కూడా తోడైయున్నాడు. మన బిడ్డలకు కూడా దేవుని మీద ఆధార పడడం నేర్పిస్తే విపత్కర పరిస్థితుల్లో వారికి దేవుడు ఆశ్రయంగా ఉంటాడు. యోసేపు చిన్నవాడైన బానిసగా అమ్మివేయబడిన తాను దేవుని మీద ఆధారపడటం వల్ల దేవుడు యోసేపుకి తోడైయుండి ప్రధానమంత్రిని చేసాడు.

## 6. దేవుని పరిచర్య చేయడం ఎలానో బోధించాలి

(1 సమూ 2:11); ఏలి సముఖంలో బాలుడైన సమూయేలు యెహోవాకు పరిచర్య చేస్తూ ఉండేవాడు...ఇక్కడ ఒక విషయం మనం గమనిస్తే ఎలి కుమారులు బహు దుర్మార్గులుగా ఉన్నారు కాని సమూయేలు దేవునికి పరిచర్య చేస్తున్నాడు.. కేవలం తల్లి యొక్క పెంపకం మాత్రమే దీనికి కారణం... చిన్న వయసులోనే దేవుని మందిరం మీద ఆశక్తిని మనం పుట్టించాలి వారిని దేవుని పనిచేయడానికి పురికొల్పాలి.

## 7. దేవునిలో యదార్థత నడవడి ఎలానో బోధించాలి

(సామె 20:11); బిడ్డల ప్రవర్తనను బట్టి వారి యొక్క జీవిత విధానం ఎలా వుంటుందో మనం గ్రహించాలి. చాలా మంది తల్లిదండ్రులు ఇది గ్రహించక వారి బిడ్డలని కోల్పోతున్నారు. బిడ్డల నడవడిక, వారి ప్రవర్తనను మనం గమనించి, వారిలో చెడుతనము కనిపిస్తే వారిని తప్పక దండించాలి.  ప్రతి చిన్న విషయంలో కూడా యదార్థముగా ఉండటం నేర్పించాలి, భక్తులు దేవునిలో ఎలా యదార్థముగా జీవించా లో బోధించాలి.

## 8. దేవుని జ్ఞానమును బోధించాలి

(లూకా 2:40) మనం మన బిడ్డలను ప్రభువు యొక్క శిక్షలోనూ, బోధలోనూ పెంచాలి. దేవుని యొక్క జ్ఞానమును వారికి బోధించాలి. వారిని ప్రోత్సహించడానికి థామస్ అల్వా ఎడిసెన్ జీవితంలో నుండి దేవుని జ్ఞానము బట్టి ప్రపంచాన్ని ఎంత ప్రభావితం చేసాడో బోధించాలి.

## 9. దేవునియొక్క రక్షణ పొందుకొనుటను గురించి బోధించాలి

(2 తిమోతి 3:14); దేవుని రక్షణ ఉచితం అది యేసుక్రీస్తు ద్వారా, పవిత్రత ద్వారా, దేవుని వాక్యము వినుట ద్వారా, క్రీస్తుయేసు నందు ఉంచిన నమ్మకం, విశ్వాసం ద్వారా మనకు రక్షణ కలుగుచున్నది అని ఎరిగి బిడ్డలను ఆ రీతిగా పెంచాలి. వినుట వలన విశ్వాసం కలుగుతుంది, ఆ వినుట దేవుని గూర్చిన మాట వలన కలుగును.

## 10. రక్షణను ఎలా కాపాడుకోవాలో నేర్పించాలి

(1 యోహాను 2:28); ప్రార్ధించడం, దేవుని వాక్యము ధ్యానించడం, పరిశుద్ధంగా, యదార్ధముగా, చిన్ని చిన్ని తప్పులను దేవుని యొద్ద ఒప్పుకొనుట ద్వారా రక్షణను కాపాడుకోగలం అని మనం పాటిస్తూ మన జీవితంలో నుండి మన పిల్లలకు బోధించాలి.

## 11. అంత్యదినాల్లో జరగబోవు సంగతులను బోధించాలి.

(ఆది 49:1) యాకోబు తన కుమారులను పిలిపించి యిట్లనెను. మీరుకూడి రండి, అంత్య దినములలో మీకు సంభ వింపబోవు సంగతులను మీకు తెలియచేసెదను. అంత్యదినాల్లో ఏం జరుగుతుంది, " అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము ఏలాగనగా మనుష్యులు స్వార్ధ ప్రియులు ధనాపేక్షులు బింకములాడువారు అహంకారులు దూషకులు తల్లిదండ్రులకు అవిధేయులు కృతజ్ఞత లేనివారు అపవిత్రులు. స్వార్ధప్రియులుగా జీవిస్తున్నారు" (2తిమోతి 3:1-4); సొంత వారిమద్యే విభేదాలు, కుటుంబాల్లో ప్రేమలేదు ఎవరి జీవితం వారిది. ఒకప్పుడు కుటుంబం కలిసి ఉండేది స్వార్ధం లేకుండా అందరూ కలిసి జీవించేవారు. తల్లిదండ్రులకు అవిధేయులుగా జీవిస్తున్నారు, నేటి దినాల్లో ఎక్కడ చూసినా వృద్ధాశ్రమాలు ఎక్కువైపోయాయి పిల్లలు మంచిస్థితిలో ఉండాలని వారు కష్టపడి తినోతినకో పిల్లలను ఉన్నతంగా చదివించి వారికొరకు మంచి ఇల్లుకట్టి మంచి భార్యను ఇస్తే వారు దానిని అనుభవిస్తూ తల్లి తండ్రికి గుప్పెడు అన్నం పెట్టలేక వారిని వృద్ధాశ్రమాలలో కొంతమంది నడిరోడ్డున వదిలి వెళ్లిపోతున్నారు. అంత్యదినాల్లో మనుష్యులు అలానే ఉంటారు. అందుకే యాకోబు వారి పిల్లలను పిలిచి జరగబోవు సంగతులను బొదిస్తున్నాడు, 12 మంది పిల్లల స్థితులను ముందుగానే ఆయన ప్రవచించాడు, బోధించాడు. ఆయన చెప్పినట్టుగానే, బోధించినట్టుగానే జరిగింది. మనము మన పిల్లలకి ఇలాంటి బోధను బోధించ గలిగితే అంటే ఇవన్నీ ఒక కథ రూపంలో వారికి చెప్పగలిగితే మన పిల్లలు మన తరువాత మంచి మంచి వ్యక్తిత్వ విలువలు కలిగిన దేవుని భయం కలిగిన సమాజాన్ని నిర్మించగలరు దేవుని ఉనికిని చాటగలరు అట్టికృప తల్లిదండ్రులుగా మనకు మన పిల్లలికి సరియైన బోధను బోధించే కృప దయచేయును గాక ఆమెన్.